సాక్షి కాకినాడ


బుధవారం | 14 | ఆగస్టు | 2024



వరి వడిగా..

వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. జోరుగా వరినాట్లు జరుగుతున్నాయి. పొలాల్లో పనులు చేస్తున్న కూలీలతో పల్లెలు కళకళలాడుతున్నాయి.


8 లో



నేటి నుంచి పవిత్రోత్సవాలు

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు బుధవారం ఉదయం నుంచి ఘనంగా నిర్వహించనున్నారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 2,99,072 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 6.10 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 11,350 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

7,320 హెక్టార్లలో ఈ-పంట నమోదు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 7,320 హెక్టార్లలో ఈ-పంట నమోదు చేశామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో 82911 హెక్టార్లలో పంటలు సాగు చేశామన్నారు. ఈ పంట నమోదుపై గత నెల 30న వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ వారీగా అధికారులకు శిక్షణ కూడా ఇచ్చిందన్నారు. జిల్లాలో ప్రతీ గ్రామంలోను ఈ-పంట నమోదు జరుగుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో పంట నమోదు విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. రైతు సేవా కేంద్రం పరిధిలో ఉన్న రైతులకు ఈ-పంట నమోదుపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

అగ్రి కోర్సు దరఖాస్తులకు ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 4 సంవత్సరాల బీఎస్సీ(హానర్స్) కోర్సు ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఆరు ప్రభుత్వ కళాశాలలు, ఆరు అనుబంధ కళాశాలలు ఉన్నాయన్నారు. 2024–25 విద్యాసంవత్సరం కోర్సు ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఐఎన్ యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఇందులో కోర్సు వివరాలు, అర్హత, వయోపరిమితి, రైతు వారి కోటా వివరాలు ఇస్తామన్నారు. అపరాధ రుసుంతో ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఐదేళ్లలో రిజర్వేషన్ తీసేయాలని బీజేపీ కుట్ర

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ విభజించు, పాలించు ధోరణిలో ఆలోచిస్తూ సుప్రీంకోర్టు ద్వారా రిజర్వేషన్లు తీసేయాలన్న కుట్ర చేస్తోందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. మంగళవారం రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ మొన్న ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో వచ్చిన తీర్పు ఇందుకు నిదర్శనం అన్నారు. చంద్రబాబు ఏ అంటే అమరావతి పి అంటే పోలవరం తప్ప ఇంకేమీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, ఇప్పుడున్న చంద్రబాబు నాయుడుల పాలనలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.ఎన్ని వేల కోట్లు ఖర్చు పెట్టారో సీఎం చంద్రబాబు లెక్కలు చెప్పాలన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపిస్తున్న చంద్రబాబు ఆధారాలతో నిరూపించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎస్సీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని అందుకే కలెక్టర్లు, ఎస్పీలుగా ఎస్సీ అధికారులను నియమించడం లేదన్నారు. కాపు, బలిజలు ఏనాటికై నా ముఖ్యమంత్రి అవుతారన్నారు. వెనుకబడిన వర్గాలకు చెందిన వారు దేశంలో 60 కోట్ల మంది ఉంటే, ముగ్గురే సుప్రీంకోర్టు జడ్జిలుగా ఉన్నారన్నారు. రాజమహేంద్రవరం 20 ఏళ్ల క్రితం ఎలా ఉందో నేడూ అలానే ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ అప్పు ఇవ్వాలంటూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను అడుక్కుంటున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు పాలనకు ఇంకో రెండేళ్లు సమయం ఇస్తామని అటుపైన తేడా వస్తే పోరాటం చేస్తామన్నారు.

పుష్కరాలకు కార్యాచరణ

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి పుష్కరాలు – 2027 నిర్వహిణకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు వెళదామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె వివిధ అంశాలపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ గతంలో జరిగిన పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సూచనలను సలహాలను పరిగణనలోకి తీసుకొని చర్యలు తీసుకుంటామన్నారు. శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ రహదారులపై అవగాహనకు వచ్చానన్నారు. ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ రహదారులను వెడల్పు చేయడం, ట్రాఫిక్ మళ్లింపు అంశాలపై ప్రత్యామ్నాయ మార్గాలను సూచించినట్లు పేర్కొన్నారు.



తడబాటు

- బీటెక్ ఫస్టియర్ ఫలితాల్లో 65 శాతం దాటని ఉత్తీర్ణత
- బ్యాక్‌లాగ్‌ల బాధ తప్పాలంటే శ్రద్ధ పెంచాలి
- ప్రథమ సంవత్సరం నుంచీ పట్టు సాధించాలంటున్న విద్యావేత్తలు
- బట్టీ కాదు.. సబ్జెక్టుపై పట్టు సాధించాలని సూచన

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్‌లో ఫెయిలయ్యే విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరిగిపోతోంది. జేఎన్‌టీయూ కాకినాడ విడుదల చేస్తున్న ఫలితాల్లో దాని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం కనీసం 65 దాటడం లేదు. ఇటీవలే వచ్చిన ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఇదే పరిస్థితి. భావి భారత యువ ఇంజినీర్ల తొలి అడుగులో ఇలా తడబాటు కనిపించడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ ప్రభావం మిగిలిన మూడు సంవత్సరాలపై పడుతుంది కనుక వారు మేలుకోవాలి. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఈ బ్యాక్ లాగ్స్ గుదిబండలా తయారవుతున్నాయని, ఇప్పటికే రెండు దశల్లో ఇంజినీరింగ్ కోర్సు ప్రవేశాలకు అడ్మిషన్లు పూర్తి చేసి ప్రథమ సంవత్సర తరగతులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో వీలైనంత త్వరగా సబ్జెక్టులు క్లియర్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

కంఠస్థంతో లాభం లేదు

పదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో టాప్ మార్కులు సాధించిన వారు సైతం ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిలవుతున్నారు. ఇంజినీరింగ్‌లో బట్టీ విధానం కంటే అప్లికేషన్ ఓరియంటేషన్‌కు ప్రాధాన్యం ఉంటుంది. స్పూన్ ఫీడింగ్‌కు అవకాశం లేదు కాబట్టి సెల్ఫ్ లెర్నింగ్‌ను అలవర్చుకోవడం తప్పనిసరి. మూక్స్, ఎన్‌పీటీఈఎల్ మార్గాల ద్వారా సబ్జెక్టులపై సొంత అవగాహన ఏర్పరచుకోవాలి. సబ్జెక్టుకు సంబంధించి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. తరగతి గదిలో అందరిముందు సందేహాలు అడగడానికి బిడియంగా ఉంటే స్టాఫ్‌రూంలో స్వయంగా కలిసి సందేహాలను నివృత్తి చేసుకోవాలి. ఆ సమయంలో తప్పకుండా నోట్‌బుక్ వంటివి కూడా ఉండాలి.

ఏ రోజు పాఠాలు ఆ రోజే...

ముఖ్యంగా ఏకాగ్రత పెంచుకుంటూ ఏరోజు పాఠాలు ఆరోజే పూర్తి చేసుకోవాలి. క్లాసకు వెళ్లేటప్పుడు ఆరోజు బోధించే పాఠ్యాంశం తెలుసుకుని దానిపై కనీసం అవగాహన పెంచుకుంటే మరింత సులభంగా అర్థమవుతుంది. అధ్యాపకుల నోట్స్‌తో పాటు రిఫరెన్స్ పుస్తకాల సహాయంతో నోట్స్ సిద్ధం చేసుకోవాలి. పరీక్షల సమయంలో ప్రీవియస్ పేపర్లను ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేస్తే బ్యాక్‌లాగ్స్ సమస్య తప్పుతుంది.

ఇలా చేస్తే ఉపయోగం

- ఇంజినీరింగ్ విద్యలోకి ప్రవేశించగానే సీనియర్ల సలహాతో ముందుకెళ్లాలి.
- అధ్యాపకులు చెప్పేది శ్రద్ధగా విని అర్థం కాకపోతే మళ్లీ అడిగి తెలుసుకోవాలి.
- హాజరు 80శాతానికి పైబడి ఉండాలి.
- నేటికాలంలో డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి.
- కళాశాలల్లో సదస్సుకు హాజరయితే విద్యార్థుల్లో ఉన్న భయం పోతుంది.
- బీటెక్‌లో 60శాతం మార్కులకు పైబడి సాధిస్తే కానీ విద్యార్థులకు ప్రముఖ సంస్థలైన టీసీఎస్, ఎసెంచర్ వంటి సంస్థల క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం ఉండదు.

శ్రద్ధ చూపాలి



ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం నుంచి సబ్జెక్టులను నిర్లక్ష్యం చేయకుండా చదువుపై శ్రద్ధ వహించాలి. అన్ని సబ్జెక్టుల్లో మొదటి ప్రయత్నంలోనే పాస్ అయ్యే విధంగా జాగ్రత్త పడాలి. సబ్జెక్టుల్లో ఫెయిల్ అవుతుంటే విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు హాజరయ్యే అవకాశం కోల్పోతారు. ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్లేవారు వీసా తిరస్కరణకు గురౌతారు. డిగ్రీ పట్టా.. సమయానికి చేతికి రాకపోతే ఉద్యోగ సాధన కష్టతరమవుతుంది. మల్టీనేషనల్ కంపెనీల ఇంటర్వ్యూలకు అర్హత కోల్పోతారు.

– ఎ.గోపాలకృష్ణ, మెకానికల్ ప్రొఫెసర్, డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్, జేఎన్‌టీయూకే

అవగాహన తప్పనిసరి



ఇంజినీరింగ్‌లో పరీక్షలు సెమిస్టర్ విధానంలో సాగడం విద్యార్థులకు కొత్తగా ఉంటుంది. గతంలో మాదిరి ఏడాది చివరలో పరీక్షలు రాసే విధానం ఉండదు. కళాశాలలో చేరిన రెండు నెలలకు మిడ్ ఆ తరువాత మూడు నెలలకు సెమిస్టర్ పరీక్షలు ఉంటాయి. ఇది వారికి కాస్త ఇబ్బందిగా మారుతుంది. కానీ ఉత్తీర్ణత శాతం పెరగడానికి సెమిస్టర్ విధానం మంచిదారి అని ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి గ్రహించాలి.

– పరుచూరి కృష్ణారావు, చైర్మన్, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల



ఇంటింటా ఓటర్ల సర్వే



ఓటర్ల జాబితా తయారీ ఇంటింటా సర్వేపై మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడ సిటీ: ఓటర్ల సంక్షిప్త సవరణ జాబితా తయారీలో భాగంగా ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్ యాదవ్ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల సంక్షిప్త సవరణ జాబితా రూపొందించడానికి ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ సజావుగా చేపట్టాలన్నారు. అక్టోబర్ 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని, అక్టోబర్ 29న సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందిస్తామని కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 29 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. తదుపరి ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. డిసెంబర్ 24వ తేదీలోగా అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కార కార్యక్రమం చేపడతామని, 2025 జనవరి ఒకటో తేదీలోగా నిబంధనల మేరకు జాబితా సిద్ధమయ్యిందో లేదా పరిశీలించాలన్నారు. 2025 జనవరి ఆరో తేదీన ఓటర్ల సంక్షిప్త సవరణ తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, కలెక్టరేట్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

పోర్టులో అవినీతి లేకుండా ప్రక్షాళన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

మంత్రి నాదెండ్ల

కాకినాడ సిటీ: కాకినాడ పోర్టులో రోజువారీ జరిగే పోర్టు కార్యకలాపాలకు, కార్మికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఎటువంటి అవినీతి కార్యకలాపాలు జరగకుండా ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం కాకినాడ పోర్టు అధికారులు, ఎగుమతిదారులు, లేబర్ యూనియన్ల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పోర్టులో ఎటువంటి అవినీతి కార్యకలాపాలకు తావులేకుండా ప్రభుత్వం ఒక ప్రత్యేకమైన విధానాన్ని తీసుకువస్తుందని తెలిపారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఈనెల 5న కాకినాడ పోర్టులో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మంత్రి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ వీసీ, ఎండీ వీరపాండ్యన్, కలెక్టర్ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావులతో కలిసి కాకినాడ యాంకరేజ్ పోర్టు ప్రాంతాలను పరిశీలించారు. కాకినాడ పోర్టు బొంబాయి కాటా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు.

'పంపా' రైతుల ఆశలకు లీకేజీ



గడ్డి మోపులను నాలుగో నెంబర్ గేటు అడుగున వేసి లీకేజీ నిలుపుదల చేసేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది

నాలుగో నంబర్ గేటు నుంచి వారం రోజులుగా వృథాగా పోతున్న నీరు

అన్నవరం: స్థానిక పంపా రిజర్వాయర్ బ్యారేజీ గేట్లుకు ఎన్ని సార్లు మరమ్మతులు చేసినా సమస్య మళ్లీ మొదటికి వస్తోంది. గత జూన్‌లో పంపా బ్యారేజీ గేట్లకు సుమారు రూ.20 లక్షలతో మరమ్మతులు చేపట్టినా నాలుగో నెంబర్ గేటు మాత్రం ఇంకా రిజర్వాయర్ అధికారులకు సమస్యగానే మిగిలింది. పంపా రిజర్వాయర్‌లో వంద అడుగుల నీటిమట్టంతో గణనీయంగా నీరు ఉన్నప్పటికీ నాలుగో నంబర్ గేటు నుంచి ఇంకా నీరు లీకవుతోంది. ఈ గేటు ద్వారా పది క్యూసెక్కుల నీరు వృథాగా పోతుండడంతో అటు అధికారులు, ఇటు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నీటి లీకేజీని అరికట్టేందుకు ఎండుగడ్డి మోపులుగా కట్టి గేటు దిగువన ఉంచేందుకు రిజర్వాయర్ సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు.

ఖరీఫ్‌పై ఆశ చిగురించిన వేళ... నీటి లీకేజీ..

జూలై రెండో వారం నుంచి ఆగస్టు మొదటి వారం వరకు కురిసిన భారీ వర్షాల కారణంగా పంపా రిజర్వాయర్ నీటిమట్టం పెరగడంతో ఆయకట్టు రైతులు ఖరీఫ్ పంటపై ఆశలు చిగురించాయి. జూలై 23న పంపా ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. మొదట 30 క్యూసెక్కులు చొప్పున విడుదల చేశారు. తరువాత వంద క్యూసెక్కులకు పెంచారు. ప్రస్తుతం రైతాంగం ఖరీఫ్ పనుల్లో బిజీగా ఉండగా రిజర్వాయర్ బ్యారేజీ గేటు నుంచి నీరు వృథాగా పోతుండడం అశనిపాతంలా మారింది.

కొత్తది వేయడమే పరిష్కారం

లీకేజీని అరికట్టడానికి నాలుగు రోజుల నుంచి సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. గడ్డిమోపులు వేస్తే కొట్టుకు పోతున్నాయి. అందుకోసం గట్టి మోపులను కర్రలకు కట్టి గేటు మొదటకు దించమని చెప్పాను. ఆ తరువాత కంకర కూడా వేసి రెండు రోజుల్లోనే నీటి వృథాను అరికడతాం. ఖరీఫ్ పంట అనంతరం నాలుగో నంబర్ గేటు మార్చే ప్రయత్నం చేస్తాం.

– ఈఈ శేషగిరిరావు

వరి వడిగా..


నారు తీస్తున్న కూలీలు

పిఠాపురం: వ్యవసాయ పనులు ఊపందుకు న్నాయి. జోరుగా వరినాట్లు జరుగుతున్నాయి. పొలాల్లో పనులు చేస్తున్న కూలీలలో పల్లెలు కళకళ లాడుతున్నాయి. ముఖ్యంగా గొల్లప్రోలు మండ లంలో ఉత్సాహంగా సాగు పనులు జరుగుతు న్నాయి. ఒకే ప్రాంతంలోని మెట్ట భూముల్లో వాణిజ్య పంటలను, మాగాణి భూములతో వరిని పండిస్తున్నారు. ఈ పనుల్లో వ్యవసాయ కూలీలు బిజీగా మారారు. కాగా.. ఇటీవల కురిసిన అధిక వర్షాలతో నాట్లు దశలోనే ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే వరినాట్లు 90 శాతం పూర్తవ్వగా, వాణిజ్య పంటల సాగు చివరి దశకు చేరుకుంది. వర్షాల వల్ల నీట మునిగిన పంటలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. దెబ్బతిన్న పంటలను కాపాడుకునే పనిలో రైతులు ఉన్నారు. మరో పక్క ఇంకా నాట్లు పడని ప్రాంతాల్లో నాట్లు వేసే పనులు ఊపందుకున్నాయి.


దమ్ము చేసిన మడిని చదును చేస్తున్న రైతు


నాట్లు వేస్తున్న కూలీలు

రేషన్ బియ్యం పట్టివేత


పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

పిఠాపురం: మండలంలోని బి.ప్రత్తిపాడు గ్రామంలో మంగళవారం పీడీఎస్ బియ్యం (రేషన్ బియ్యం) పట్టుకున్నట్టు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు. పక్కా సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు నిర్వహించగా ఒక వాహనంలో 58 బస్తాల్లో ఉంచిన 3,150 కేజీల బియ్యాన్ని గుర్తించామన్నారు. దీనిని అక్రమంగా తరలిస్తున్న ఆకుల గంగ రాజుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సీజ్ చేసిన బియ్యం, వాహనం విలువ రూ.8,93,325 ఉంటుందన్నారు. తనిఖీలో విజిలెన్స్ ఎస్సై టి.జగనాథరెడ్డి, పిఠాపురం సీఎస్డీటీ వీరాస్వామి, కానిస్టేబుళ్లు లోవ రాజు, శివ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాడపల్లిలో పవిత్రోత్సవాలు

- మూడు రోజుల పాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు బుధవారం ఉదయం నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. పవిత్రోత్సవాల సందర్భంగా మూడు రోజులు పాటు ఆలయంలో అష్టోత్తర పూజలు, కల్యాణాలు, ఉపనయనాలు, వివాహాలను రద్దు చేశామన్నారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దుతున్నారు. వివిధ రకాల పుష్పాలు, పువ్వులతో ముస్తాబు చేస్తున్నారు.


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వర స్వామి

కార్యక్రమాల వివరాలు

పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సాయంత్రం 5 గంటలకు సంకల్పం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన, గురువారం ఉదయం 8 గంటలకు సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సాయంత్రం 5 గంటలకు పవిత్రారోహణం, విశేష అర్చన, పవిత్ర ప్రతిష్ట ప్రధాన హోమాలు, 16వ తేదీ ఉదయం 8 గంటలకు సంకల్పం, మహాశాంతిహోమం, ప్రాయశ్చిత్ర హోమం, మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, మహదాశీర్వచనం నిర్వహించనున్నారు.

స్వర్ణ ధ్వజస్తంభానికి మరిన్ని హంగులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీర వేంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానంలోని స్వర్ణ ధ్వజస్తంభానికి మరిన్ని హంగులు సమకూరనున్నాయి. నెల్లూరుకు చెందిన భక్తుడి విరాళం సుమారు రూ.మూడు కోట్లతో ఈ నెల తొమ్మిదో తేదీన స్వామివారి సన్నిధిలో స్వర్ణ ధ్వజస్తంభాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ ధ్వజస్తంభం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. దీని ఏర్పాటు కోసం స్వామివారి ఆలయం ఎదురుగా గల శ్లాబ్‌కు గుండ్రంగా రంధ్రం చేశారు. ధ్వజస్తంభం ఆ రంధ్రంలోంచి ఆలయ శిఖరానికి సమాన ఎత్తు వరకూ వచ్చింది. దాని చివరలో సుదర్శన చక్రం, మేఖలాలు ఏర్పాటు చేశారు. అయితే వర్షం వస్తే ఆ ధ్వజస్తంభం రంధ్రంలోంచి వర్షం చినుకులు దిగువకు పడే అవకాశం ఉంది. దీంతో దాన్ని చెక్కలతో తాత్కాలికంగా మూసివేశారు. ఇప్పుడు ధ్వజస్తంభం నుంచి పైకి చూస్తే శ్లాబ్ రంధ్రానికి వేసిన చెక్కులు తప్పు మరేమీ కనిపించవు. ఈ నేపథ్యంలో ఆ చెక్కలకు బదులు గ్లాస్‌తో తయారు చేసిన డోమ్ లాంటిది ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల దిగువ నుంచి చూస్తే గ్లాస్ డోమ్‌లోంచి ధ్వజస్తంభం చివరి వరకూ కనిపించే అవకాశం ఉంటుంది. వైదిక కార్యక్రమాలకు అవసరమైనపుడు ధ్వజస్తంభం మీద గ్లాస్ డోమ్ తొలగించేలా ఏర్పాటు చేయనున్నట్లు దేవస్థానం డీఈఈ ఉదయ్ తెలిపారు.


స్వర్ణ ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

హోటల్ సర్వర్ అనుమానాస్పద మృతి

అమలాపురం టౌన్: అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లోని ఒక హోటల్లో సర్వర్‌గా పనిచేస్తున్న పులిదిండి సత్యనారాయణ (50) సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన పులిదిండి సత్యనారాయణ పదేళ్లుగా ఇదే హోటల్లో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి వరకూ పనిచేసి నిద్రపోయాడు. హోటల్ యజమాన్యం మంగళవారం ఉదయం చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న అతడి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సత్యనారాయణ హృదయ సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడని సమాచారం.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు వెంకటేష్

మామిడికుదురు: విశాఖపట్నంలో ఈ నెల 17వ తేదీ నుంచి జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు మామిడికుదురుకు చెందిన డిగ్రీ విద్యార్థి కడలి దివ్యతేజ వెంకటేష్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. కాకినాడలో ఈ నెల 11వ తేదీన జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరఫున పాల్గొన్న వెంకటేష్ బంగారు పతకం సాధించాడన్నారు. తద్వారా రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు తెలిపారు. వెంకటేష్‌తో పాటు అతడి కోచ్ కె.చిన్నను ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు మోకా రంగారావు, యాలంగి రవికుమార్, పెచ్చెట్టి రాధ అభినందించారు.



జీజీహెచ్ ఉద్యోగికి షోకాజ్ నోటీసు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అట్రాసిటీ కేసు పెడతానంటూ ఉన్నతాధికారులు, సహోద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ ఉద్యోగికి రాజమహేంద్రవరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ మంగళవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. దారా గౌతమ్ రాంజీ అనే వ్యక్తి రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో జనరల్ డ్యూటీ అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అట్రాసిటీ కేసు పెడతానంటూ బెదిరిస్తున్నాడని కొద్దిరోజుల క్రితం అతడి వ్యవహారశైలిపై 38 మంది ఎంఎన్ఓలు, జీడీఏలు విచారణాధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో సూపరింటెండెంట్ జోక్యం చేసుకుని సహోద్యోగులతో వ్యవహరించే తీరును మార్చుకొని రోగుల సంరక్షణ కోసం నిబద్ధతతో పనిచేయాలని, ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని రాంజీని మందలించారు. రాంజీ తీరులో మార్పు రాకపోగా ఫిర్యాదుదారులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాడు. అంతేకాకుండా అట్రాసిటీ కేసు పేరుతో బెదిరింపులకు గురిచేస్తున్నాడనే ఫిర్యాదుతో సూపరింటెండెంట్ మంగళవారం రాంజీకి షోకాజ్‌నోటీసు జారీ చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కరప: అప్పుల బాధ తట్టుకోలేక విష గుళికలు తిని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరప గ్రామానికి చెందిన వజ్రపు సత్యనారాయణ వెల్డింగ్ పనిచేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఆరు నెలల క్రితం వెల్డింగ్ షాపు తీసుకుని సొంతంగా వ్యాపారం ప్రారంభించాడు. పనులు అంతగా లేక, వ్యాపారం సాగక షాపు నిర్వహణకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే దారిలేక తాగుడుకు అలవాటు పడ్డాడు. ఈ నేపథ్యంలో అప్పుల బాధ తట్టుకోలేక మంగళవారం ఉదయం వెల్డింగ్ షాపు వద్ద విష గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడు వాంతులు చేసుకోవడాన్ని ఒక బాలుడు గమనించి ఇంటికి వెళ్లి విషయం చెప్పాడు. అతడి భార్య దేవి వెంటనే షాపు వద్దకు వచ్చి భర్తను వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడి చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్సై పి.శోభన్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో 11 జిల్లాలకు చెందిన అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఇస్తున్న శిక్షణ మంగళవారం కూడా కొనసాగింది. దీనిలో భాగంగా మహిళా స్నేహ పూర్వక గ్రామం అనే అంశంపై తరగతులు జరుగుతున్నాయి. ఫ్యాకల్టీలు ప్రసాద్, నిహారిక, పద్మజ మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక కార్యక్రమాలల్లో మహిళల భాగస్వామ్యంపై అవగాహన పెంచాలన్నారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని, శారీరక ఆరోగ్యం, మానసిక స్థితిపై శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీలు బి.వెంకటేశ్వర్లు, చక్రఫణి రావు, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన అధికారులు